క్లుప్తంగా

భ్రామరికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాములపాడు: మండల కేంద్రంలో శుక్రవారం మండల ఉపాధ్యక్షుడు బండ్లమూరి వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ సభ్యుడు ముర్తుజావలి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు బత్తుల గాలి గౌడులు రాయలసీమ గౌడ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు షర్ఫుద్దీన్, మురళి, రామకృష్ణ, రమేష్, మక్బూల్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



ఆరోగ్యకేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ మంజులవాణి

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. శుక్రవారం తర్తూరు గ్రామ సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. సచివాలయ ఉద్యోగులు నిర్ణీత సమయంలో విధులకు హాజరై బయోమెట్రిక్ వేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం హెల్త్‌సెంటర్‌ను పరిశీలించి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. నిర్మాణంలో ఉన్న గ్రామసచివాలయాన్ని పరిశీలించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.


చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ నాయకుడు గూడూరు రవికుమార్‌రెడ్డి సూచించారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని జీవన్‌జ్యోతి పాఠశాల వద్ద బీజేపీ యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి సహకారంతో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ పదిరోజుల పాటు క్రికెట్ పోటీలు జరుగుతాయని, విజేతలకు బైరెడ్డి శబరి నగదు బహుమతులు అందజేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాటర్ రఫి, కాటం నాగన్న, రమణ, వెంకటశివ, శ్రీకాంత్, మౌలాలి, జలీల్, సిరాజ్, బాషా, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనులంతా ఏకం కావాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పాములపాడు: బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు సూచించారు. శుక్రవారం స్థానిక బచ్చాడ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద చైతన్య కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నోట్లతో పేదల ఓట్లను కొనుగోలు చేస్తూ అగ్ర కులాల నాయకులు అధికారం చేజిక్కించుకుంటున్నారన్నారు. డబ్బుకు అమ్ముడుపోకుండా బహుజనులకే ఓటు వేసి రాజ్యాధికారం కట్టబెట్టాలన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- సమస్యలను ప్రస్తావించిన ప్రజాప్రతినిధులు
- నీళ్లు నమిలిన అధికారులు
- గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కె.కుసుమలత సూచన



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తూ.. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పరిష్కరించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల మాటను ఏ మాత్రం గౌరవించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలను ఎందుకు పరిష్కరించలేని కొందరు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలారు. ముందుగా అధికారులు తమతమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కొంతమంది ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు రావడంలేదని, గ్రామాల్లో పనులు సక్రమంగా కల్పించడం లేదని, చాలా మందికి జాబ్‌కార్డులు లేక పనులు చేసుకోలేక వలసలు వెళ్తున్నారని ఎంపీటీసీ సభ్యులు ముబీనాబేగం, స్రవంతి, సర్పంచులు బాల ఎల్లయ్య, జమిలాబీలు తెలిపారు. ముసలిమడుగు గ్రామంలో తాగునీటి బావి సమస్యను గత నాలుగు సర్వసభ్య సమావేశాల్లో ప్రస్తావించినా పరిష్కరించిన పాపాన పోలేదని ఎర్రమఠం ఎంపీటీసీ సభ్యులు ముబీనాబేగం ఆవేదన వ్యక్తం చేశారు. శివపురంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు పడిపోతున్నా, కొన్ని విద్యుత్ తీగలు గాలికి పడిపోయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యుడు శివన్న ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులంటే అధికారులకు ఏమాత్రం మర్యాదలేదని, ప్రభుత్వ పనుల్లోనూ తమను భాగస్వాములను కానివ్వడం లేదని, సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేయండి

ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కె.కుసుమలత అధికారులకు సూచించారు. సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను నోట్ చేసుకొని తర్వాత సమావేశంలో పరిష్కారం చేశారా లేదా అని చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి సమావేశంలో సమస్యలు వింటున్నారే తప్ప పరిష్కారం దిశగా ఏ అధికారి కృషి చేయకపోవడం తగదన్నారు. కేవలం పనులు జరిగినప్పుడు, అధికారుల సమీక్షా సమావేశాలు జరిగిప్పుడు ఫొటోలకు మాత్రమే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో పనులు చేయకపోవడం బాధాకరమన్నారు. మండలంలో గిరిజన గూడేలలో ఆధార్ లేక ఇబ్బందులు పడుతున్నవారి జాబితా ఇవ్వమని అడిగితే ఏ పంచాయతీ కార్యదర్శి ఇవ్వకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. అధికారులు సరిగా పనిచేయకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. పలు శాఖల అధికారులు సర్వసభ్యసమావేశానికి హాజరు కావడంలేదని, అలా ఎక్కువసార్లు హాజరుకాని అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ఎంపీడీఓ మేరిని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు, మండలాభివృద్ధిపై సమావేశం జరుగుతుంటే నిర్లక్ష్యం వహించే అధికరాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఇదిలా ఉండగా సమావేశం మధ్యలోనే కొన్ని శాఖల అధికారులు బయటికి వెళ్లిపోవడం గమనార్హం. సమావేశంలో పీఓ ఎల్ఆర్ డీటీ పెద్దన్న, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, ఎంఈఓ శ్రీరాములు, ఏఓ మహేష్, వైద్యులు వినోద్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దేవజయమ్మ, కమల, ఏపీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, వైస్‌ఎంపీపీ-2 జయమ్మ, సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, నిత్యలక్ష్మీదేవి, చందమామల శోభలత, ఎంపీటీసీలు రమిజాబీ, బాలరాజు పాల్గొన్నారు.

డ్రైవర్‌కు గాయాలు

వెలుగోడు: పట్టణంలోని శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం మోతుకూరు గ్రామానికి చెందిన రాము ఆటోలో నల్లకాల్వ గ్రామంలో కూలీలను వదిలి తిరిగి వస్తుండగా పట్టణంలోని లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పంప్ హౌస్ వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ రాము తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సమీపంలోని ప్రాథమిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో నంద్యాలకు తరలించారు.

కల్యాణమస్తు, షాదీతోఫాతో 45 మందికి లబ్ధి

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకంతో నియోజకవర్గ వ్యాప్తంగా 45 మందికి లబ్ధి చేకూరినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్‌తోఫా పథకాల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. జూపాడుబంగ్లా మండలంలో ఐదుగురు, పగిడ్యాల 6, కొత్తపల్లి 4, పాములపాడు 12, మిడ్తూరు 8, నందికొట్కూరు మండలంలో 10 మందికి చొప్పున లబ్ధి చేకూరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి అర్హుల బ్యాంకు ఖాతాలకు నగదు జమచేశారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే శిల్పా



వధూవరులతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, భువనేశ్వరరెడ్డి

మహానంది: మహానందిలోని కళ్యాణమండపంలో శుక్రవారం జరిగిన ఓ వివాహ వేడుకకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వరరెడ్డిలు హాజరయ్యారు. బొల్లవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహులు కుమారుడు పాములేటి వివాహానికి వచ్చిన వారు నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బొల్లవరం మాజీ సర్పంచ్ బండి రమణయ్య, మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ మెంబర్ బండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీ సేవ

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు వైభవంగా చేపట్టారు. గోమాతను అలంకరించి పూజలు చేశారు. పల్లకీ ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

మున్సిపల్ కార్మికులపై వేధింపులు తగదు



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జూపాడుబంగ్లా: మున్సిపల్ కార్మికులపై వేధింపులు తగదని వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు పక్కీర్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులను వేధిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సునీతను బదిలీచేయాలని కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సునీత కొత్త నిబంధనలు పెట్టి కార్మికులను సతాయిస్తూ మానసిక ఒత్తిడికి గురిచేయటం సబబుకాదన్నారు. కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సునీతను బదిలీచేయాలని, కార్మికులకు ఫేషియల్ హాజరు తీసేయాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌నాయకులు పరమేష్, భాస్కర్, నాగేశ్వరరావు, ప్రతాప్, దాసు, ప్రదీప్, శ్రీనివాసులు, నాగమ్మ, భాగ్యలక్ష్మి, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయటం తగదు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జూపాడుబంగ్లా: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి అరకొరగా నిధులు కేటాయించి నిర్వీర్యం చేసేందుకు యత్నించటం తగదని సీపీఎం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పక్కీర్‌సాహెబ్, రైతుసంఘం నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వారు నందికొట్కూరు పట్టణంలోని సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం వల్ల ఎంతో మంది కూలీలు వలసలు వెళ్లకుండా ఉన్న ఊళ్లోనే ఉపాధి పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వారం క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్ల నిధులు మాత్రమే కేటాయించటం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమన్నారు. వాస్తవానికి రూ.2.40 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తేనే ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. వేసవి ఎండల తీవ్రత పెరుగుతున్నందున పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు. కూలీలకు రోజుకు కనీసం రూ.250ల గిట్టుబాటు కూలీ కల్పించాలన్నారు. పనుల వద్ద మెడికల్ కిట్లు, కూలీలకు పనిముట్లు, నీటిసౌకర్యం కల్పించాలన్నారు. వేసవి అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఆలయానికి వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ధర్మకర్తలు సురేంద్రనాథ్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి 35 ప్రత్యేక సర్వీసులు

ఆత్మకూరురూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి 35 ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మహేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ప్రస్తుత చార్జీలతోనే ఈ సర్వీసులను నడుపుతామన్నారు. కర్నూలు నుంచి శ్రీశైలానికి రూ.350, నందికొట్కూరు – శ్రీశైలం రూ.300, ఆత్మకూరు – శ్రీశైలం రూ.250, దోర్నాల – శ్రీశైలం రూ.130 చార్జీ ఉంటుందన్నారు. అలాగే 8, 19వతేదీలలో ఆత్మకూరు నుంచి రుద్రోడు, సంగమేశ్వరం, కొలను భారతి క్షేత్రాలకు 5 సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆర్టీసీ సేవలను భక్తులు వినియోగించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహానంది: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహానంది, తిమ్మాపురం, గాజులపల్లె, బుక్కాపురం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పాములపాడు: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ ఎర్రన్న సూచించారు. శుక్రవారం మండలంలోని లింగాల జెడ్పీహెచ్ స్కూల్, ఇస్కాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలు, వినియోగిస్తున్న వారెవరైనా సరే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల జీవితం అంధకారమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలుగుతూ బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్‌నాయక్ పాల్గొన్నారు

పంటల నమోదు తప్పనిసరి

పాములపాడు: రైతులు సాగు చేసుకున్న పైర్ల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు మందుల వివరాలు ఇవ్వాలన్నారు. పాడి రైతులు పశు అంబులెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే 1962 నంబరుకు ఫోన్ చేయాలని పశువైద్యాధికారి సాయిలీల వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఫణీశ్వరరెడ్డి, సెరికల్చర్ అధికారి విజయ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం




పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పగిడ్యాల: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో పేదలకు తీవ్ర అన్యాయం చేసి, బడా వ్యాపారులకు లబ్ధి చేకూర్చారని సీపీఐ నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం పడమర పాత్రకోట పోస్టాఫీసు ఎదుట సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. వంట గ్యాస్ ధరలను అమాంతం పెంచి సబ్సిడీ కూడా ఇవ్వకుండా పేదల నడ్డి విరుస్తోందన్నారు. ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చలువ పందిళ్ల ఏర్పాటు



కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరాలయం కృష్ణా జలాల నుంచి బయల్పడింది. దీంతో ఆలయంలోని వేపదారు శివలింగానికి పూజలు చేసుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తుల రాకపోకలు ఎక్కువయ్యాయి. సప్తనది సంగమేశ్వరుడి దర్శనం కోసం వచ్చిన భక్తులకు, సందర్శకులకు వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయ ఆవరణలో పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.



చలువపందిళ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

యానాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



యానాదుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు

నంద్యాల: ఎన్నో ఏళ్లుగా స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న యానాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు సూచించారు. పట్టణ శివారులో నివాసిస్తున్న యానాదుల ఇళ్ల వద్దకు శుక్రవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యానాదులు గత కొన్నేళ్లుగా తాము పట్టణ శివారులో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నామని, మాకు ఇళ్ల స్థలం, ఇళ్లు లేవని ఆదుకోవాలని కోరారు. గతంలో మాకు కులధ్రువీకరణ పత్రాలు కూడా ఉండేవి కాదని, ప్రస్తుత ప్రభుత్వం అవి ఇస్తుందని చెప్పారు. గృహాలు కూడా మంజూరు చేస్తే మీకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని యానాదులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్, జంపారం గల్లి, కుర్రా రామలక్ష్మి, మురళీ, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, మాజీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, కృష్ణనాయక్, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ట



నాభిశిలకు పూజలు చేస్తున్న మహిళలు

బండిఆత్మకూరు: పార్నపల్లె గ్రామంలో శుక్రవారం సీతారామ, వేణుగోపాల్ స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో సాగింది. మూడు రోజులుగా శాస్త్రోక్తంగా పూజారులు పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పార్నపల్లె గ్రామానికి తరలి వచ్చారు. దీంతో గ్రామంలో బంధువుల రాకతో కళకళలాడింది. ఉదయం 10 గంటల సమయంలో విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభాన్ని, నాభిషిలను ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పార్నపల్లె గ్రామానికి వచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. బండిఆత్మకూరు వైద్యులు భావనారెడ్డి, సవిత ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచి షబ్బీర్, ఉప సర్పంచి రామలింగేశ్వరరెడ్డి, ఆలయ చైర్మన్ దేరెడ్డి జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, కడిపిరెడ్డి దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలాభిషేకం..నేత్రపర్వం

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవా ల్లో భాగంగా వేలాదిగా తరలివస్తున్న భక్తులకు శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్లు ఆకట్టుకుంటున్నాయి. టోల్‌గేట్ సమీపంలో నిర్మించిన ఫౌంటెన్లు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఫౌంటెన్లలో శివలింగానికి జలాభిషేకం చేస్తున్న దృశ్యాలు, శివలింగం ఎదురుగా నందీశ్వరుడికి జలాభిషేకం భక్తులను ఆధ్యాత్మికభరితంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫౌంటెన్ల వద్ద భక్తులు ఆహ్లాదాన్ని పొందుతూ, ఫొటోలు దిగుతున్నారు.



నంది విగ్రహానికి జలాభిషేకం